క్లుప్తంగా

చెన్నూర్‌లో శ్రీ వేంకటేశ్వర వైభవ కథా సప్తాహం

చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 3 వరకు శ్రీ వేంకటేశ్వర వైభవ కథా సప్తాహాన్ని భారతీ తీర్థ పుష్కర గ్రహీత బాచంపల్లి సంతోశ్‌కుమార్ శాస్త్రి నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పులి దత్తాత్రేయ శర్మ తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 వరకు సాయంత్రం 5 గంటల నుంచి 7:30 గంటల వరకు కథా సప్తాహం నిర్వహించనున్నట్లు తెలిపారు. కథా సప్తాహానికి హాజరైన భక్తులకు భోజన ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త షేక్ అంకూస్ నాలుగు నెలల క్రితం వాగులో పడి మృతి చెందగా బీఆర్‌ఎస్ సభ్యత్వంతో ఇన్సూరెన్స్ కింద రూ.2లక్షలు మంజూరయ్యాయి. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేతుల మీదుగా మంగళవారం బెల్లంపల్లిలో అంకూస్ భార్య చాంద్ బీకి అందించారు. బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని, అలాంటి కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణరెడ్డి, ఎంపీటీసీలు రాంచందర్, లక్ష్మీ నాయకులు ఆడె బాధు, బోయిని తిరుపతి, అగ్గి సత్తయ్య, చింతల భీమయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద మంగళవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు కల్యాణం జరిపించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

చెన్నూర్: పట్టణానికి చెందిన శ్రీరామగౌడ్ అనే బాల్య మిత్రుడికి తోటి మిత్రబృందం సభ్యులు మంగళవారం ఆర్థికసాయం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీరామగౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడగా తొంటి ఎముక విరిగింది. కొన్ని రోజులుగా మంచానికే పరిమితమయ్యాడు. లేవలేని స్థితిలో ఆర్థిక ఇబ్బందులతో బాధ పడుతున్నాడు. రామగౌడ్ పరిస్థితి తెలుసుకున్న తోటి స్నేహితులు బాల్య మిత్రుడికి రూ.40వేల ఆర్థిక సాయం అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో కట్ల శ్రీనివాసాచార్యులు, చిన్ననాటి స్నేహితులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

జన్నారం: రైతులకు పచ్చి రొట్టకు ఉపయోగించే జీలుగ, జనుము విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి సంగీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు ఆగ్రోస్ సేవా కేంద్రంలో, జనుము విత్తనాలు పీఏసీఎస్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జీలుగకు రూ.1116, జనుము విత్తనాల బస్తాకు రూ.1448 చెల్లించి అవసరమైన రైతులు తీసుకెళ్లాలని సూచించారు. అదే విధంగా విత్తనాలకు వెళ్లే రైతులు ఆధార్‌కార్డు, పాసు పుస్తకం, అకౌంటు పుస్తకం జిరాక్సులు పట్టుకెళ్లాలని సూచించారు.

కలమడుగులో సామూహిక హనుమాన్ దీక్షలు



దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

జన్నారం: మండలంలోని కలమడుగు గ్రామంలో మంగళవారం 120మంది భక్తులు సామూహిక హనుమాన్ దీక్షలు చేపట్టారు. పురోహితులు రాజనరేంద్రశర్మ ఆధ్వర్యంలో హనుమాన్ మాల వేసుకున్నారు. శ్రీరామ నామస్మరణతో భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. ఆలయ పరిసరాలు కాషాయమయంగా మారింది.

లైబ్రరీ లేక ఇబ్బందులు..!

- అవస్థలు పడుతున్న నిరుద్యోగ యువత
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని నిరుద్యోగులు వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుండగా, పట్టణంలో అన్ని వసతులతో కూడిన లైబ్రరీ, స్టడీ సెంటర్ వంటివి లేకపోవడంతో నిరుద్యోగ యువత ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ తదితర ప్రాంతాలలోని కోచింగ్ సెంటర్లకు వెళ్లడానికి ఆర్థికంగా స్థోమత లేని నిరుద్యోగులు, ఈ ప్రాంతంలో పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌తో పాటు అన్ని మౌలిక వసతులతో కూడిన శాశ్వత లైబ్రరీని ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో శాశ్వత లైబ్రరీని ఏర్పాటు చేయాలని పలువురు నిరుద్యోగులు స్థానిక ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు, సింగరేణి అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా నేటికీ ఫలితం కానరాలేదని వాపోతున్నారు.

సింగరేణి భవనం కేటాయిస్తే మేలు..

శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి సంస్థకు చెందిన పలు భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. సింగరేణి అధికారులు కొంత చొరవ చూపి సింగరేణి పారిశ్రామిక ప్రాంత నిరుద్యోగ యువత మేలుకోసం నిరుపయోగంగా ఉన్న పలు భవనాలలో ఒక దానిని శాశ్వత లైబ్రరీ ఏర్పాటుకు కేటాయిస్తే నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. లైబ్రరీ ఏర్పాటు చేయడం వల్ల యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా, కొంతమేర దోహదపడుతుందని పలువురు మేధావులు సూచిస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి..

ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి అన్ని మౌలిక వసతులు, స్టడీ మెటీరియల్‌తో కూడిన శాశ్వత లైబ్రరీ ఏర్పాటుకు చొరవ చూపాలని నిరుద్యోగ యువత పోటీ పరీక్షలలో రాణించి ఉన్నతస్థానాలకు ఎదగడానికి సహకరించాలని పలువురు నిరుద్యోగులు కోరుతున్నారు.

లైబ్రరీ ఏర్పాటు చేయాలి



పట్టణంలో చాలా మంది నిరుద్యోగులు ఉన్నారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లడానికి ఆర్థిక స్థోమత లేక సరైన స్టడీ మెటీరియల్ లేక ఇళ్లలోనే ప్రిపేర్ అవుతున్నారు. శాశ్వత లైబ్రరీని ఏర్పాటు చేస్తే పోటీ పరీక్షలకు ప్రిపరేషన్‌కు సులబతరం అవుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి లైబ్రరీ ఏర్పాటుకు సహకరించాలి.

– సీపల్లి రాజు, శ్రీరాంపూర్

ఆర్థిక స్థోమత లేదు



నేను ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తూ వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. దూర ప్రాంతాలలోని కోచింగ్ సెంటర్లకు వెళ్లి కోచింగ్ తీసుకోవడానికి తగిన ఆర్థిక స్థోమత లేదు. పట్టణం వేగంగా విస్తరించింది. పట్టణంలో నిరుద్యోగ యువత ఎక్కువగా ఉంది. అన్ని రకాల మౌలిక వసతులు, స్టడీ మెటీరియల్‌తో కూడిన లైబ్రరీ ఏర్పాటు చేస్తే ఎంతో మంది నిరుద్యోగులకు మేలు జరుగుతుంది.

– కోరెపు రాజు, కృష్ణాకాలనీ

ఇబ్బందిగా ఉంది



నేను ఇంట్లో ఉండి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాను. ఇంట్లో చదువుకోవడానికి ప్రత్యేక గది లేకపోవడంతో ప్రిపరేషన్‌కు ఆటంకం ఏర్పడుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్రత్యేక దృష్టి సారించి స్టడీ మెటీరియల్‌తో పాటు వసతులతో కూడిన శాశ్వత లైబ్రరీని ఏర్పాటు చేస్తే నిరుద్యోగులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి సౌకర్యంగా ఉంటుంది.

– అరిషాల భూమయ్య, శ్రీరాంపూర్ కాలనీ

మురుగు నీటిని తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



కోటపల్లి: మండలంలోని అన్నారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రహరీని ఆనుకొని మురుగునీరు కుంటలాగా మారిందని 'మురుగు నీటితో జనం అవస్థలు' అని మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అధికారులు మురుగు నీటిని తీయించి అటువైపుగా రాకుండా చర్యలు తీసుకున్నారు. ఇందుకుగాను గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేశారు.

బోర్ మరమ్మతులు చేశారు



మరమ్మతు అనంతరం ట్రయల్ రన్

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: పట్టణ పరిధిలోని 2వ వార్డు లక్ష్మీనగర్‌లోని ఓ పవర్ బోర్ నెల రోజులుగా పనిచేయడం లేదని ఈ నెల 21న 'సాక్షి'లో ప్రచురితమైన 'బోర్‌కి మరమ్మతులు చేయించండి సార్లూ..' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మంగళవారం కొత్త మోటార్ బిగించి నీటి సరఫరా పునరుద్ధరింపజేశారు. దీంతో సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి'కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో మంగళవారం ఎల్లమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బుధాకలాన్ గ్రామంలోని గౌడ కులస్తులు, మహిళలు పెద్ద ఎత్తున డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ ఎల్లమ్మ బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గురిజాలకు వెళ్లే ప్రధాన రహదరి పక్కన ఉన్న ఎల్లమ్మ గుడి వద్దకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ ఒగ్గు కళాకారులు ఎల్లమ్మ కథను ప్రదర్శించి, ప్రత్యేక పూజలు చేపట్టి ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. అనంతరం ఎల్లమ్మకు తీరొక్క నైవేద్యాలు సమర్పించి, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

చెన్నూర్: ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుల జనగణన చేసి బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఒడ్డెపల్లి మనోహర్, బీసీ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నీరెటి రాజన్న, నియోజకవర్గ నాయకులు మర్తా మారుతి, చిత్తారి కిశోర్, గుండెటి మధుకర్, అవిడపు గణేశ్‌లు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

జైపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, బీసీ కులగణన చేపట్టిన తర్వాతనే, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పద్మశాలీ సంఘం, బీసీ సంఘం జిల్లా నాయకులు మార్తమారుతి కోరారు. మండల కేంద్రంలో గత తహసీల్దార్ కార్యాలయంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో బీసీ కులగనన చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ఆవిడపు గణేశ్, వేముల మల్లేశ్, కల్యాపు శ్రీనివాస్, సుంకరి శ్రీనివాస్, నారాయణచారి, సారంపల్లి తిరుపతి, బొద్దున శంకర్, జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గుండ్లపాడు, దుబ్బగూడం గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఆదివాసీ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ పేంద్రం శంకర్ మంగళవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

అటెన్షన్ ప్లీజ్..



గొల్లవాగు ప్రాజెక్ట్‌కు సీసీ రోడ్డు నిర్మించరా?

భీమారం: మండల కేంద్రం సమీపంలోని గొల్లవాగుప్రాజెక్ట్ వరకు మట్టిరోడ్డు ఉండటంతో వర్షకాలంలో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ప్రాజెక్ట్ నిర్మించిన సమయంలో ఆవిడం రోడ్డు నుంచి ప్రాజెక్ట్ వరకు సీసీ రోడ్డు నిర్మిస్తామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే ప్రాజెక్ట్ నిర్మించి 15సంవత్సరాలు దాటుతున్నా, నేటికీ సీసీ రోడ్డు నిర్మించలేదు. దీంతో ప్రాజెక్ట్ సందర్శన కోసం వచ్చే పర్యాటకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని సీసీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : శశాంక్ రెడ్డి, ఏఈ, గొల్లవాగుప్రాజెక్ట్, భీమారం

ఫోన్ నంబర్ : 95052 89404

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



లక్సెట్టిపేట: పూలమాలలు వేస్తున్న నాయకులు



మందమర్రిరూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు

- పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు
- రాజీవ్‌గాంధీ ఆశయసాధనకు కృషి చేయాలని సూచన

మందమర్రిరూరల్/జన్నారం/బెల్లంపల్లి/చెన్నూర్/వేమనపల్లి/లక్సెట్టిపేట/రామకృష్ణాపూర్: స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ తీవ్రంగా శ్రమించారన్నారు. పట్టణాలతో సమానంగా గ్రామాలు అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధిసాధించాలని పట్టుదలతో కృషి చేశారన్నారు. దేశంలో ఐటీ రంగాన్ని తీసుకొచ్చింది రాజీవ్‌గాంధేనని పేర్కొన్నారు. దేశం కోసం తన ప్రాణాలను సైతం రాజీవ్‌గాంధీ లెక్క చేయలేదని తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మందమర్రిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్‌గౌడ్, ఈసీసీ సభ్యుడు నూకల రమేష్, జన్నారంలో రాజశేఖర్, లక్ష్మీనారాయణ, ఇసాక్, గంగాధర్, సుధీర్‌కుమార్, శ్రీకాంత్, రజాక్, శాభీర్, ముజ్జు, సత్తన్న, బెల్లంపల్లిలో మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీలు సిలివేరి సత్యనారాయణ, గెల్లి జయరాం, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, చెన్నూర్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చెన్న సూర్యనారాయణ, శ్రీనివాస్, జనార్దన్‌రావు, బానేష్,రాజేశ్, మహేశ్, రాకేశ్, శ్రీకాంత్, వేమనపల్లిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాబీర్ ఆలీ, రామకృష్ణాపూర్‌లో టీపీసీసీ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, గోపతిరాజయ్య, అబ్దుల్‌అజీజ్, గాండ్లసమ్మయ్య, లక్సెట్టిపేటలో చింత అశోక్, ఎండీ ఆరిఫ్, స్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



జన్నారం: శ్రద్ధాంజలి ఘటిస్తున్న నాయకులు



చెన్నూర్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'తూకం వేసిన ధాన్యానికి రశీదు ఇవ్వట్లే'

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన నాలుగు లారీల వరిధాన్యం బస్తాలను అధికారులు రైస్‌మిల్లులకు తరలించడం లేదని రైతులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం రైతులు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన ధాన్యానికి రశీదులు ఇవ్వడంలేదని వాపోయారు. దీంతో వర్షాలకు ధాన్యం తడిస్తే తాము నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. 41కిలోలు తూకం వేసి 39కిలోలకే డబ్బులు ఇస్తామని సెంటర్ నిర్వాహకులు అంటున్నారని తెలిపారు. అధికారులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

'భూ కబ్జాకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు

చెన్నూర్: పట్టణంలోని కుమ్మరిబొగుడలో గల 678/1 సర్వే నంబర్‌లో గల 4 గుంటల భూమిని బండారి చిన్నన్నకు విక్రయిస్తే నాలుగు గుంటలతో పాటు మరో మూడు గుంటల భూమిని కబ్జా చేసి నన్ను ఇబ్బందులుకు గురి చేస్తున్నాడని బాధితుడు ఎరుకల దేవయ్య ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితుడు మాట్లాడారు. కబ్జా చేసిన నా భూమిని ఇవ్వాలని పలువురు పెద్ద మనుషులు చెప్పినా, వినడం లేదన్నారు. నాకు జరిగిన అన్యాయాన్ని మాట్లాడేందుకు వచ్చిన వారిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం మద్దెల భవాని మాట్లాడుతూ... ఎరుకల దేవయ్యకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే నా పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, నేను వేధింపులకు గురిచేస్తే ఆధారాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి, నా భూమిని పరిశీలించి నాకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో గంగ భవాని, గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి కుట్టు మిషన్ కేంద్రం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం

కాసిపేట: సోమగూడెం గ్రామపంచాయతీ కేంద్రంలోని మహిళాశక్తి కుట్టుమిషన్ కేంద్రాన్ని మంగళవారం కేంద్ర బృందం పరిశీలించారు. సెక్రెటరేట్‌లోని ట్రైనీ అసిస్టెంట్ సెక్రెటరీ ఆఫీస్ సిబ్బంది శిక్షణలో భాగంగా మండలాల్లోని వివిధ శాఖల్లో పనులు పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో ఐదుగురు సభ్యులకు పాతబెల్లంపల్లి గ్రామపంచాయతీ కేటాయించగా, ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు విద్యార్థుల స్కూల్ యూనిఫాం లు కుట్టుటకు కేటాయించడంతో ఆ కేంద్రాన్ని పరిశీలించారు. శాఖల వారీగా పనుల వివరాలు తెలుసుకోవడంలో భాగంగా ఐకేపీ, ఈజీఎస్ పనులను పరిశీలించినట్లు తెలిపారు. బృందంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఏఎస్‌వోలు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, ఐకేపీ ఏపీఎం శ్యామల, ఈజీఎస్ ఏపీవో ఎస్తార్ డేవిడ్ ఉన్నారు.

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: ప్రభుత్వం సన్న వడ్లకే బోనస్ చెల్లించడంపై బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. మండలంలోని ఆదిల్‌పేట్ గ్రామంలో జెడ్పీటీసీ వేల్పుల రవి ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న వడ్లకే బోనస్ ఇస్తానని చెప్పడం అన్యాయమని, దొడ్డు వడ్లకు కూడా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల పక్షాన పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, కో ఆప్షన్ మెంబర్ నసీరొద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.